# మీ బిడ్డనే నాన్నా!

ఆదూరి వెంకట సీతారామమూర్తి



**నాన్నా!**

ఎన్నాళ్ళకి చూశాను నాన్నా నీ దగ్గర్నించి ఉత్తరం! మా పెళ్ళయిన కొత్తల్లో ఏడాదిపాటు నెలకో ఉత్తరమైనా నీ దగ్గర్నించి అందుకునేదాన్ని. ఆ తర్వాత నాకు పిల్లలు కలిగి నేను నా కుటుంబంలో స్థిరపడ్డానని మీరు అనుకున్నాక ఉత్తరాలు తగ్గిపోయాయి. ఆడబిడ్డని ఎంత త్వరగా పరాయి ఇంటిదాన్ని చేసి దూరం చేసుకుంటే అంత సుఖమన్న అభిప్రాయం చాలా మంది తల్లిదండ్రుల్లో ఎందుకు కలుగుతుందో నాకిప్పటికీ అర్థం కాదు. బహుశా డబ్బు పెట్టాలనే భయం వల్ల కావొచ్చనేమో? ఆ మాటకొస్తే ఆడబిడ్డను పెద్ద చదువులు చదివించడానికి భయం. ఒక మెట్టు పైసంబంధం చూస్తే కట్నకానుకలు ఎక్కువగా అడుగుతారేమోనని భయం. తక్కువ ఇవ్వజూపితే అసలు పెళ్ళే అవదేమోనని భయం. పెళ్ళయ్యాక మరోరకమైన భయం. ఆడబిడ్డను కన్న తల్లిదండ్రులకు కలిగే ఈ భయాలన్నీ సహజమైనవేనని ఎప్పటికీ అనుకోవాలా?

నామట్టుకు నాకు డిగ్రీ చదవాలనిపించేది. సంగీతంలో ప్రావీణ్యత సంపాదించాలనిపించేది. దేవుడు నాకిచ్చిన గొంతును సద్వినియోగం చేసుకోవాలనిపించేది. సినిమా పాటల వరసల్లో నేను కూర్చుకుని పాడిన భక్తిపాటలకే అందరూ నన్ను మెచ్చుకునేవారు. స్కూలు ఫంక్షన్‌లో నేను పాడిన పాటకు చప్పట్ల వర్షంకురిసేది! ఆ ఆనందమే నన్ను ఉత్తేజపరచేది! కానీ అప్పట్లో మనింట్లో నా పాటకు విలువ లేదు. ఆట, పాట మన వంశం వారివికావు అన్నారుగా! అని ఎవరి సొత్తుగానో భావించాలనేవారుగా! ఎంతో విచారమని పించేది. వెయ్యిమందిలోనైనా ఒకరికి ఉండని కంఠస్వరం నీది అనేవారు శైలజా టీచర్. స్కూలు విడిచిపెట్టాక ఆవిడ నాచేత ఎన్నో పాటలు పాడించుకొన్న రోజులెన్నో నేను చెప్పలేను. మంచి మంచి భావాలున్న పాటలిచ్చి పాడమనేవారు - కొన్నిటికి రాగాలు కూర్చమనేవారు. నేనీనాడు వృద్ధిలోకి వచ్చి ఒక సాధారణ గాయనిగానైనా నిలబడ్డానూ అంటే అది ఆనాడు ఆమె ఇచ్చిన ప్రోత్సాహమే.

సంగీతం, నాట్యం మనవి కావన్నారు. నా అభిరుచికి అడ్డుగోడలు కట్టారు. కనీసం డిగ్రీ వరకైనా నా చదువును సాగనిచ్చేరు కాదు. ఇంటర్

మొదటి సంవత్సరంతోనే నా చదువు ఆగిపోతుందంటే అప్పుడు నాకెంత దుఃఖం కలిగిందో తెల్సా? బామ్మ రూపురేఖలూ గుణగణాలూ నాకు రావడం నా అదృష్టం. నేను చూడకపోయినా అందరూ చెప్పుకొనే ఆమె సహన సౌశీల్యం కూడా నాకు అబ్బి ఉంటే ఎంత బావుండునో కదా అనుకుంటుంటాను. చదువుపట్ల నాకున్న కోరిక అప్పట్లో తీరకపోయినా ఏ వెంట్రుకవాసిలోనో నన్నావరించి ఉన్న నా అదృష్టం నన్ను వివాహితురాల్ని చేసింది. ఒక సంస్కారవంతునికి భార్యగా చేసింది. నా రూపు, పెళ్ళి చూపులనాటి నాపాట ఆయనకు ఇష్టమై నన్నాకర్షించేలా చేస్తే స్వశక్తిమీద ఆయనకుండే నమ్మకం, కళలపై ఆయనకుండే అభిమానం, పెద్దలపట్ల ఉండే గౌరవం ఇప్పటికీ నన్నాయనను మనసులో నింపుకునేలా చేస్తున్నాయి.

కట్నకానుకలు విషయమైకూడ మీనుండేగాని వారి నుండి ఏ మాటా రాకపోవడం నేను అప్పట్లోనే గమనించాను.

'మీరివ్వాలనుకున్నదేమైనా మీ అమ్మాయికే ఇవ్వండి' అని వారనడం వారి సంస్కారంగానే నేను భావించాను. ఆరకమైన వెసులుబాటును కలలో కూడా ఊహించని మీరు అదే అదనుగా అనుకున్నదానికంటే తక్కువ ఖర్చుతోనే నా పెళ్ళి జరిపించి అత్తవారింటికి పంపారు. బామ్మ నాకోసం దాచివుంచిన నగలు, ఇతర వస్తువులు కూడ మీ ట్రంకు పెట్టెల్లోనే ఉండిపోయినా నేను పట్టించుకోలేదు.

కానీ తర్వాత్తర్వాత రక్త సంబంధాలు కూడా వ్యాపార సంబంధాలుగా మారిపోవడం నాకు అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించింది. 'కలవారికోడలు దానికి మనం పెట్టేదేముంది' అని మీరు నన్ను ఎడంపెట్టినా, మీరిచ్చే పసుపుకుంకుమలే నాకు ఆభరణాలనే భావన నాలో చావలేదు. అత్తవారినుండి పెట్టుపోతల పట్టింపులు ఆయనకు లేవు. అదే నా ఉక్రోషం! నిజానికి నా జీవితం మీ దగ్గరకంటె ఆయన నీడలోనే బాగా విస్తరించిందని చెప్పగలను. ఆ సంగతి మీరు గ్రహించినట్లు నాకు కనపడలేదు. నా చదువు కొనసాగించటంకోసం, నా కోర్కెలూ సరదాలూ తీరటం కోసం ఆయన ఎంత డబ్బు, ఎంత విలువైన సమయాన్ని వెచ్చించారో మీకెలా చెబితే బోధపడుతుంది?

ఆడబిడ్డకి పుట్టిల్లంటేనే మోజు, మమకారం అంటారు. మరి ఆడబిడ్డను కన్న తల్లిదండ్రులు కూడా మగబిడ్డలతోపాటు ఆడబిడ్డల్నీ సమానంగా చూసుకుంటేనే కదా ఆనందమనిపించేది! ఆ విషయంలో నాకు కొంత అసంతృప్తి ఉన్న మాట నిజం. అన్నయ్య వ్యాపారం పెట్టుబడికీ, తమ్ముడి చదువుకీ ఖర్చు చేసిందాంట్లో నా చదువుకీ పెళ్ళికీ కలిపి మీరు ఖర్చు చేసిందెంత? డబ్బు విషయంలోనే కాదు మిగతా చాలా విషయాల్లో కూడా తక్కువగానే చూశారన్న సంగతి మీకూ తెల్సు.

**గుప్తదానాలు**




భారతరత్నగా భారతదేశపు నైటింగేల్‌గా పేరుగడించిన లతామంగేష్కర్‌కి ఓ చిత్రమైన అలవాటుంది. సమయం కుదిరినపుడు పుట్టినూరుకి 'కోల్హాపూర్' వెళ్తుంది. అక్కడ తనకు తెలిసిన పేదలందరికీ పళ్ళు, దుస్తులూ పంచి పెడుతుంది. ఆర్థికంగా బాధ పడుతున్నవారికి సహాయం చేస్తుంది. అయితే ఎవరికి ఏంచేసినా ఆ భగవంతుడి సంకల్పం వలన నేను చేయగలిగింది చేశాను. ఈ విషయాలు బయటికి మాత్రం చెప్పకండి అంటోంది లతాజీ.

(కొన్ని నిజాలు దాస్తే మాత్రం దాగుతాయా?)

నా పెళ్ళి చేయడంతోనే మీ బాధ్యత తీరిపోయినట్టుగానే భావించారు గాని తర్వాత నా జీవితంలో వచ్చిన వివిధ మార్పుల్ని మీరు కనిపెట్టి అభినందించ లేకపోయారన్నది నిజం! చిరకాలంగా నా గొంతులో అణిగిమణిగిన పాటే వారి ప్రోత్సాహంతో తను స్వేచ్ఛ పొంది నన్ను వృద్ధిలోకి తీసుకువచ్చింది. రేడియోల్లోనూ టీవీల్లోనూ కాసెట్లలోనూ నేను పాడిన పాటలకు జనం అభినందించారు గాని మీనుండి ఒక ప్రశంసాపూర్వకమైన ఉత్తరాన్ని కూడా నేను అందుకోలేకపోయాను. అది దురదృష్టం. ఎన్నో విషయాలలో ఆయన నాకు గురువు, దైవం, స్నేహితుడు, శ్రేయోభిలాషీనూ. తాళి కట్టి తన జీవితంలోకి ఆహ్వానించిన మర్నాటినించీ ఆయన నా భవిష్యత్తుకు సోపానాలు వేశారు. నేనీనాడు ప్రైవేటుగా డిగ్రీ పూర్తి చేయగలిగినా, సంగీతంలో నాక్కావలసిన మెళుకువలు నేర్చుకున్నా. అది నా కృషి ఎంత మాత్రం కాదు. ఆయన పట్టుదల! ఆడదైనా ఇంట్లో సోమరిగా కూర్చోకూడదు. తనకు నచ్చిన రంగంలో కృషి చేయాలి. అదే ఆయన అభిమతం.

నాన్నా! తాతలనాటి ఇంటిని మీరు రెండు భాగాలుగా చేసి అన్నయ్యకూ తమ్ముడికీ పంచి ఇచ్చినప్పుడు మీకు కలిగింది ముగ్గురు



సంతానమని మీరు భావించకపోవడం నాకు బాధనే కలిగించింది. పెళ్ళి చేసి ఒకరింటికి పంపిన కారణంగా నేను మీ అభిమానాలకూ ఆస్తిపాస్తులకూ దూరం కావడం నేను భరించలేకపోయాను. నేనే మగాడిని అయివుంటే నా పెళ్ళి చేశాక కూడా ఆస్థి పంచేవారు గదా అన్పించింది. వృద్ధాప్యంలో మగపిల్లలే చూస్తారనీ, ఆడబిడ్డలం వాళ్ళ వాళ్ళ సంసారాల్లోపడి కన్నెత్తయినా చూడరని మీ అభిప్రాయం కాబోలు! అది తప్పుడు అభిప్రాయమని తేలిపోయిందిగా. వ్యాపారానికి డబ్బూ, ఆస్థిపాస్తులూ ఇచ్చినా అన్నయ్య అత్తారింటి చూరు పట్టుకునే వేలాడాడు. పెద్ద చదువు చదివిన తమ్ముడు పెళ్ళయ్యాక వేరింటి కాపురం పెట్టి ఆస్తి పంపకాలయిన రెండేళ్ళకే తన వాటాని అమ్ముకున్నాడు. నిస్సహాయంగా చూస్తూ ఊరుకున్నారే తప్ప ఏం చేయగలిగారు మీరు?


నా మట్టుకు నేను నా పిల్లల విషయంలో ఎటు వంటి తారతమ్యాన్నీ చూపించదల్చుకోలేదు. నా కొడుక్కీ కూతురికీ మా ఆస్తిపాస్తుల్ని చెరి సమానంగానే పంచాలనుకుంటున్నాం. వాళ్ళు చదివినంతవరకూ చదివించాలనే అనుకుంటున్నాం. పెళ్ళి చేసిన తర్వాత కూడా ఆడబిడ్డను మా బిడ్డగానే జీవితాంతం చూడాలనుకుంటున్నాం. ఆడబిడ్డ అయినా అదెక్కడ ఉన్నా మన బిడ్డే కదా నాన్నా!

నాన్నా! నీ ఉత్తరం చూశాను. నీమీద కోపం లేదు. పెళ్ళయిన ఆడబిడ్డని కన్నబిడ్డలా చూడని తల్లిదండ్రులమీదే నా అక్కసంతా. తను పట్టుకున్న కొమ్మ గట్టిదై బలంగా ఉంటే స్త్రీ తన జీవితంలో లతలా పాక్కుంటూపోతుంది. అలా కాని పక్షంలో ఆ కొమ్మనందించిన కన్నవారు ఆ ఆడబిడ్డకు సాయంగా నిలవకపోతే ఎలా అన్నదే నా ప్రశ్న! పెట్టుపోతల గురించి కాదు నా బాధ. సంపాదించుకోగల కొడుకులకు ఆస్తులు పంచి ఆడబిడ్డను మాత్రం అన్నిటికీ పరాయింటిపైనే ఆధార పడమని చేతులు దులుపుకోడం ఏ సమాజం మనకి నేర్పిందో నాకైతే అర్థం కాదు.

అందిరావాల్సిన కొడుకులు అక్కరకు రాకుండా పోవడం మీ దురదృష్టం. నాకు నా భర్త, పిల్లలూ ఎంతో మీరూ అంతే మీరొచ్చి ఇక్కడ ఉన్నా మాకేం అభ్యంతరం ఉండదు. అక్కడే ఉండాలనుకుంటే నాకు తోచిన సాయం ఆయన అనుమతితోనే చేయగలను. ఆడబిడ్డనే అయినా నేను మీ బిడ్డను నాన్నా! అమ్మకి నా నమస్కారాలు.

మీబిడ్డ

సర్వమంగళ ❋



## ఏదో ఒకటి చేయాలిగా!

ఇటీవల 'అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం'కి ప్రభుత్వ సలహాదారు (టీ.వి.మరియు నాటక రంగం)గా హాజరయిన అక్కినేని మరోమారు మరో ప్రపంచం, సుడిగుండాలు ప్రస్తావన తీసుకొచ్చాడు. నిర్మాతగా చేతులు కాల్చుకున్నాం అని ఇప్పటికి లక్షాతొంభై సభల్లో చెప్పడం జరిగింది. చేతులు కాలబట్టే చరిత్రగా మిగిలిపోయింది. ఆ రోజుల్లో అవసరమయిన వసతులు, ఆర్థిక సహకారం ప్రభుత్వపరంగా లేదుగనుక చేతులు కాలాయి. ఇపుడు అన్నీ వున్నాయి. పిల్లల్ని ప్రభావితం చేయగల సినిమాలు తీయెచ్చుగా!

# గృహిణులకు చిట్కాలు

గ్యాస్ స్టవ్ గట్టుని ఒక కప్ వెనిగర్ నీటిలో కలిపి కడిగితే చీమలు చేరకుండా వుంటాయి.

మూడు వంతుల పెరుగులో ఒక కప్పు పంచదార కలిపి జుట్టుకి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత వేడినీటితో తలస్నానం చేస్తే చుండ్రు మాయం అవుతుంది.

మాంసం త్వరగా ముక్కలు కావాలంటే వేడినీటిలో కత్తిని ముంచి తరగాలి.

లెదర్ బ్యాగ్‌లు, బూట్లమీద వేసలయిన్ రాస్తే కాంతిగా వుంటాయి.

దుస్తులు లైట్‌గా కాలితే మరక మీద ఉప్పు చల్లి ఉతికితే ఫలితం ఉంటుంది.

కాచిన నీరు ఎక్కువసేపు వేడిగా వుండాలంటే ఆ నీటిలో కొంచెం ఉప్పు వేయాలి.

పనీరు వేయించేముందు మరుగుతున్న నీటిలో వేస్తే మెత్తగా, ముద్దగా వుంటుంది.

గ్రుడ్లను ఉడకబెట్టిన నీటిని పారపోయకుండా చెట్లకు పోయవచ్చు.

శరీరం రోజంతా తాజాగా వుండాలంటే స్నానం చేసే నీటిలో ఒక చుక్క నిమ్మరసం వెయ్యాలి.

ఆభరణాలు కాంతిని కోల్పోతే వాటిని ఒక స్టీలు డబ్బాలో కొంచెం పసుపు వేసి అందులో వుంచండి. మూడు రోజుల తరువాత చూస్తే ఆభరణాలు పోయిన కాంతిని తిరిగి పొందుతాయి.

విటమిన్ టాబ్లెట్లకు వాటి సమయం దాటిపోతే అవి పారేయకుండా పొడిచేసి చెట్లలో వేస్తే చెట్లకు మంచి ఎరువుగా ఉపయోగపడతాయి.

కూరగాయలు ఎర్రగా వేగాలంటే నూనెతో పాటు కొంచెం పంచదార కలపాలి.

గ్రుడ్లు పాడైపోకుండా ఎక్కువ రోజులు వుండాలంటే వాటికి కొద్దిగా రిఫైండ్ ఆయిల్ పుయ్యాలి.

కాఫీపొడి డబ్బాలోగానీ, సీసాలోగానీ గడ్డకట్టుకుపోతే కొంచెం వేడినీరు పోసి బాగా కలిపి ఫ్రిజ్‌లో పెట్టుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు.

ఉడకబెట్టిన బంగాళదుంప తొక్కులతో అద్దాన్ని శుభ్రం చేసుకుంటే అద్దం తళతళా మెరుస్తుంది.

మట్టిగాజులు ఎక్కువ రోజులు పగలకుండా ఉండాలంటే వాటిని మొదట వేడినీటిలో వేసి ఆ తరువాత చల్లని నీటిలో ముంచాలి.

పుస్తకాల అరలో పొగాకు చల్లితే అవి చెదలు పట్టకుండా వుంటాయి.

ఆమ్లేట్ మెత్తగా వుండాలంటే గ్రుడ్డు సొనలో ఒక స్పూన్ నిమ్మరసం కలపాలి.

శరీరం దుర్గంధం రాకుండా వుండాలంటే రోజువాటర్‌ని చెమటపట్టే ప్రదేశాలలో రాసుకోవాలి.

అల్లపురసం త్రాగితే జలుబు, దగ్గులనుంచి తొందరగా ఉపశమనం పొందవచ్చు.

వాడని కత్తులకు, కత్తెరలకూ వేసలైన్ రాస్తే అవి కొన్ని వారాల వరకూ పదునుపోకుండా వుంటాయి.

వెండి ఆభరణాలను ఉడకబెట్టిన బంగాళదుంపతో రుద్దితే తళతళా మెరుస్తుంటాయి. ❋